


దళారులదే రాజ్యం



రుద్రవరం మండలం కొండమాయపల్లె సమీపంలో ఆరబోసిన మొక్కజొన్నలు

- క్వింటాకు మూడు కేజీల తరుగు
- నష్టపోతున్న మొక్కజొన్న రైతులు

రుద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న కొనుగోలులో దళారులదే రాజ్యమైంది. తరుగు పేరుతో దోపిడీ జరుగుతోంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,34,350 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. అయితే దళారులు, వ్యాపారులు సిండికేట్ అయి రైతులను మోసం చేస్తున్నారు. దళారి చెప్పిందే ధర, వ్యాపారి కొన్నదే సరుకు అన్న విధంగా పరిస్థితి తయారైంది. వంద కేజీల మొక్కజొన్నలు కొనుగోలు చేస్తే అందులో మూడు కేజీలు తరుగు తీస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, ధర పడిపోవడంతో నష్టం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. దళారుల రాజ్యాన్ని అడ్డుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

క్వింటా ధర రూ.3,100 నుంచి రూ.2300కు తగ్గిన వైనం సెప్టెంబరులో మొక్కజొన్న ధర క్వింటా రూ.3100 పలికింది. అక్టోబరు రాగానే రూ.2300కు పడిపోయింది. అంటే ఒక క్వింటాపై రైతు రూ.800 నష్టపోతున్నాడు. వ్యాపారులు దళారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని మార్కెట్‌రేటుకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రుద్రవరం సమీపంలో మొక్కజొన్నలు ఆరబోస్తున్న రైతులు



మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

మొక్కజొన్న దిగుబడికి గిట్టుబాటు ధర కల్పించాలి. దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నారు. దళారులు, వ్యాపారుల ఆగడాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలి. ఇలా అయితే రైతులు నష్టాలు చవిచూడక తప్పదు. -భాస్కర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆళ్లగడ్డ



క్వింటాకు మూడు కేజీల తరుగు

మొక్కజొన్న కొనుగోలులో క్వింటాకు మూడు కేజీలు తరుగు తీస్తున్నారు. రైతులను దోపిడీ చేస్తున్నారు. కొనుగోలులులో అక్రమాలు జరగకుండా అడ్డుకోవాలి. ధరలో కూడా తేడా చూపిస్తున్నారు.
- బాలనరసింహులు, రుద్రవరం మండలం, రైతు సంఘం నాయకుడు



ఆశతో సాగు చేశాం

ఆశతో మొక్కజొన్న పంట సాగు చేశాం. సెప్టెంబరులో క్వింటా ధర రూ.3100 ఉండేది. అక్టోబరు రాగానే రూ.2300కు పడిపోయింది. క్వింటాపై రూ.800 నష్టపోతున్నాం.
- మైసూరారెడ్డి, రైతు, నరసాపురం



మొక్కజొన్న పైరు

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

రూ.వెయ్యి చొప్పున జరిమానా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో జరిగిన ఓ హత్య కేసులో ఆళ్లగడ్డ న్యాయస్థానం గురువారం ఇద్దరికి జీవిత ఖైదు విధించింది. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య వివరాల మేరకు.. కోటపాడుకు చెందిన షేక్ హుసేన్‌బీ తన కుమార్తెను ఆళ్లగడ్డ పట్టణంలోని రామదాసు వీధికి చెందిన షేక్ అహమ్మద్ హుసేన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అల్లుడు అహమ్మద్ హుసేన్ తన కుమార్తెను సరిగ్గా చూసుకోవడం లేదన్న కారణంతో హత్య చేసేందుకు హుసేన్‌బీ కుట్ర పన్నింది. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన షేక్ హుసేన్‌వలితో కలిసి అల్లుడు అహమ్మద్ హుసేన్‌పై కోటపాడులో కిరోసిన్ పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన అహమ్మద్ హుసేన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో 2019లో కేసు నమోదైంది. నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండుకు పంపించారు. గురువారం ఆళ్లగడ్డ న్యాయస్థానంలో వాదోపవాదాలు జరిగాయి. సాక్ష్యాలను పరిశీలించిన 5వ అదనపు జిల్లా జడ్జి వీవీఎస్ మురళీకృష్ణ.. షేక్ హుసేన్‌వలి, షేక్ హుసేన్‌బీలకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

అలగనూరు రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్



అలగనూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

మిడుతూరు, అక్టోబరు 24 : (ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కలెక్టర్ రాజకుమారి గురువారం సందర్శించారు. రిజర్వాయర్‌లోకి ఏవిధంగా నీరు చేరుతుంది.. రిజర్వాయర్ కట్ట కుంగడానికి గల కారణాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కట్ట కింది భాగంలో గతంలో ప్రవహిస్తున్న చల్ల వాగు కారణంగా కరకట్ట కుంగిందని అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. కట్ట కుంగినా వేసవిలో ఒక టీఎంసీ నీటిని నిల్వ ఉంచి కడపకు తరలించామని ఈఈ ప్రతాప్ తెలిపారు. అనంతరం కేసీ కెనాల్, తెలుగు గంగా, కుందూ, గాలేరు, నిప్పులవాగు, కండలేరు వాగుల ప్రవాహం గురించి మ్యాప్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. రిజర్వాయర్‌లో విలీనమైన తలముడిపి ఎర్రచెరువును కలెక్టర్ రాజకుమారి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ మోహన్‌రావు, ఏఈలు వీరమ్మ, కృష్ణప్రియ, మనోహర్, నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో రామయ్య పాల్గొన్నారు.

డీఈవోగా జనార్దనరెడ్డి



నంద్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారిగా జనార్దనరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గురువారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. కర్నూలులోని డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న జనార్దనరెడ్డికి నంద్యాల జిల్లా డీఈవోగా పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించింది. గతంలో డీఈవోగా పని చేసిన సుధాకర్‌రెడ్డిని ఎఫ్ఏసీ విధుల నుంచి తొలగించి గతంలో డోన్ డిప్యూటీ ఈవోగా పని చేసిన స్థానానికి బదిలీ చేశారు.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు



మహానందిలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి

- 15న మహానందిలో కోటి దీపోత్సవం
- 29న మహానందీశ్వరునికి లక్ష బిల్వార్చన

మహానంది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం దేవస్థానం పరిపాలన భవనంలో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల గురించి వివరించారు. గత ఏడాదికంటే ఈ ఏడాది కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శని, ఆది, సోమవారాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయంలో ప్రాతఃకాల పూజలు నిర్వహించడంతోపా టు 3.30 గంటలకు మహా మంగళ హారతుల సేవలను జరుపుతామని చెప్పారు. 4 గంటల నుంచి సాధారణ దర్శనంతోపాటు కోనేర్లలో కార్తీక స్నానాలు చేసుకునేందుకు భక్తులకు అనుమతిస్తామన్నారు. క్యూలో ఉండే భక్తులకు ఉచితంగా పాలు, మంచినీటి బాటిళ్ల అందిస్తామని తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో సామూహిక అభిషేకాలు నిర్వహించుకునే ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కార్తీక మాసోత్సవంలో పరోక్ష రుద్రాక్ష సేవలో భాగంగా రూ.2 వేలు చెల్లించే భక్తులకు ఒక రోజు స్పర్శ దర్శనం కల్పిస్తామన్నారు. నవంబరు 15న కార్తీక పౌర్ణమి పురష్కరించుకొని క్షేత్రంలో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం జరుపుతామని చెప్పారు. 29న మాస శివరాత్రి పురష్కరించుకొని ప్రధాన గర్భాలయంలో లక్ష బిల్వార్చన, 30న కామేశ్వరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చనతోపాటు శాంతి కల్యాణం నిర్వహించడంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జునశర్మ, జనార్దన్‌శర్మ, రాజమాణిక్యశర్మతో పాటు ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ శ్రీనివాసులు, శానిటేషన్ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

డీఆర్వోగా రాములు నాయక్

నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓల బదిలీ

నంద్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డీఆర్ఓతో పాటు నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో హెచ్ఎన్ఎస్ఎస్ (హంద్రీ నీవా సుజల స్రవంతి) యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డీ రాము నాయక్ నంద్యాల డీఆర్ఓగా నియమితులయ్యారు. ప్రస్తుతం నంద్యాల డీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న పద్మజను తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు జీఏడీలో రిపోర్టు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. వాస్తవానికి ఆమె నవంబరులో రిటైర్ అవనున్నారు. అప్పటి వరకు ప్రభుత్వం ఆమెను డీఆర్ఓగా కొనసాగిస్తారని, అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన బదిలీల్లో ఆమెను మినహాయించారని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం అనూహ్యంగా ఆమెను బదిలీ చేసింది. అలాగే నంద్యాల ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జునరెడ్డిని కూడా తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు జీఏడీలో రిపోర్టు చేసుకోమని చెప్పారు. ఆయన స్థానంలో కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా చేస్తున్న సీ విశ్వనాథ్‌ను నియమించింది. ఇక తిరుపతి వీసీఏసీ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కేసీ నరసింహులును డోన్ ఆర్డీఓగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం అక్కడ పని చేస్తున్న బి.మహేశ్వరరెడ్డిని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆత్మకూరు ఆర్డీఓగా పని చేస్తున్న ఎం. దాసు ఈ నెల 31న రిటైర్ అవబోతున్నారు. ఆత్మకూరు ఆర్డీఓ బాధ్యతలను ప్రకాశం జిల్లా కంభంలో పీఎస్‌పీపీ ఆర్ఆర్ యూనిట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా చేస్తున్న దేశిరెడ్డి నాగజ్యోతికి అప్పగించారు.

ఆయన ఆనాటి ఎమ్మెల్యే ఆత్మ

రాజకీయ అండతో అనేక అక్రమాలు


- గత వైసీపీ ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- బ్లాక్ లిస్టులో పెట్టాలని సీడీఎంఏ ఆదేశాలు
- ఉత్తర్వులు బేఖాతర్.. ఆ కాంట్రాక్టరుకే మళ్లీ పనులు



ఆదోని మున్సిపాలిటీ అధికారులు 14వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి కాంట్రాక్టరు ద్వారా ఒప్పందం చేసుకున్న నిజామొద్దీన్ కాలనీ ప్రధాన రోడ్డు ఇది. ఈ వీధిలోనే సీసీ డ్రైనేజీ నిర్మించాల్సి ఉంది.

కర్నూలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆ కాంట్రాక్టరు పేరు చెబితే అధికారులకు హడల్. నాటి ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డిని సాయి అని పేరు పెట్టి పిలవగలిగేంతటి సాన్నిత్యం ఆయనకు ఉంది. ఆ చనువుతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు. ఇంజనీర్లతో సంబంధం లేదు.. ఒప్పందాలను పట్టించుకోవాల్సిన పని లేదు. తాను ఏ పని చేస్తే అదే ఒప్పందంగా రికార్డు చేయాల్సిందే. లేదంటే నాటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నుంచి ఫోన్లు వచ్చేవి. నిరుపేదలు నివసించే నిజామొద్దీన్ కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి అధికారులు నిధులు మంజూరు చేశారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆ పని చేస్తే లాభం రాదనో.. మరే ఇతర కారణమో.. ఆ కాంట్రాక్టరుకే ఎరుక. సీసీ డ్రైనేజీ నిర్మాణం చేయకపోగా ఎలాంటి అనుమతులు లేకుండా మరో ప్రాంతంలో బీటీ రోడ్డు వేశారు. దీనిపై ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ.. కాంట్రాక్టరున 'బ్లాక్ లిస్ట్'లో పెట్టేందుకు సమగ్ర నివేదిక పంపాలని మున్సిపాలిటీ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ)ని ఆదేశించారు. రాజకీయ అండతో అదే కాంట్రాక్టరుకు రూ.కోట్ల విలువైన పనులు ఇవ్వడం విమర్శలకు తావిస్తున్నది.

మిగతా 6లో..



కాంట్రాక్టర్, మున్సిపల్ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 2023 నవంబరు 9న ఆర్‌డీకి సీడీఎంఏ రాసిన లేఖ

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో రూ.కోట్ల విలువైన సీసీ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు నిర్మించడం వంటి పనులు చేపట్టారు. ఈ పనులు మెజార్టీగా నాటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆత్మగా పిలవబడే ఆయన అత్యంత సన్నిహితుడైన ఓ కాంట్రాక్టరు చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా నిజామొద్దీన్ కాలనీ వార్డు నంబరు ఇంటి నుంచి 5/633/1 నుంచి ఇంటి నంబరు 5/660 వరకు సీసీ డ్రైనేజీ నిర్మాణానికి రూ.18.79 లక్షలతో మున్సిపల్ ఇంజనీర్లు టెండర్లు పిలిచారు. ఆ పనుల్ని నాటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అత్యంత సన్నిహిత కాంట్రాక్టరు దక్కించుకున్నారు. 2022 మార్చి 21న మున్సిపల్ ఇంజనీర్లతో ఒప్పందం చేసుకున్నారు. అయితే.. నిబంధనలను తుంగలో తొక్కి సీసీ డ్రైనేజీ నిర్మాణం చేయకుండా అదే కాలనీలో మరో వీధిలో బీటీ రోడ్డు (తారు రోడ్డు) నిర్మించారని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. టెండరు ఒప్పందం నిబంధనలు ప్రకారం పనులు చేయించాల్సిన ఇంజనీర్లు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కంఠమెత్తితే.. కరతాళ ధ్వనులే..!


సత్యహరిశ్చంద్ర నాటకంలోని వేటకీను పాత్రలో గల్లా పిచ్చయ్య

కళ

- నాటక రంగంలో 41 ఏళ్లుగా విశేష సేవలు
- విభిన్న పాత్రల్లో ఆయన అభినయం అద్భుతం
- నాటక రంగంలో రాణిస్తున్న గల్లా పిచ్చయ్య

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న నాటక రంగానికి జీవం పోస్తున్నారు. అనుకున్నంత ప్రోత్సాహం లేకపోయినా ప్రదర్శనలు మాత్రం అలాగే కొనసాగిస్తున్నారు. ఆత్మకూరు ప్రాంతానికి చెందిన గల్లా పిచ్చయ్య అనే కళాకారుడు నాటక రంగానికి విశేష సేవలు అందిస్తున్నారు. 41 ఏళ్లుగా అనేక పాత్రలు పోషిస్తూ వస్తున్న ఆయన తన ప్రతిభతో అందరి మెప్పు పొందుతున్నారు. వేదికపై గొంతెత్తితే సభికుల కరతాళ ధ్వనులే తప్పా.. మరేమి వినపడని విధంగా నాటక రంగంలో ప్రావీణ్యం సాధించారు. తెలుగు విద్వాన్ చదువుకున్న ఆయన తెలుగు భాషపై మమకారాన్ని పెంచుకొని నాటక రంగానికి ఆకర్షితులయ్యారు. భాషా ఉచ్ఛారణను మెరుగుపర్చుకునే క్రమంలో తెలుగు నాటక రంగంలోకి 1983లో తొలిసారిగా ఆయన ప్రవేశించారు. నాటి నుంచి వెనక్కి తిరిగి చూడకుండా నాటక రంగంలో రాణిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నాటకాలు వేస్తూ తన విశేష ప్రతిభతో ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.


శ్రీకృష్ణ రాయబారం నాటకంలో..

నాటక రంగానికి ప్రభుత్వ తోడ్పాటు అవసరం



ఆదరణ తగ్గుతున్న నాటకరంగాన్ని భావితరాలకు తెలియజేసేందుకు గాను ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాటకరంగ కళాకారులకు ఆర్థిక తోడ్పాటునందించి ఆ రంగంలో విశేష సేవలందించిన వారందరికీ పింఛన్‌తోపాటు ఇతర రాయితీలు కల్పిస్తే.. కళాకారులు మరింత ఉత్సాహంతో తమ కళను మెరుగుపర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ప్రతిఏటా నాటక రంగ కళల పోటీలను నిర్వహించి కళాకారులకు ప్రోత్సాహం అందించాలి. అలాంటప్పుడే పదికాలల పాటు కళలు పదిలంగా ఉంటాయి.

- గల్లా పిచ్చయ్య, నాటక రంగ కళాకారుడు

ఆ పాత్రల్లో ఆయనే మేటి



నాటక రంగ ప్రదర్శనల్లో పలు పాత్రల్లో గల్లా పిచ్చయ్యకు ఆయనకు ఆయనే సాటి అని చెప్పవచ్చు. అద్భుతమైన వేషధారణతో ఆకట్టుకునే అభినయ ప్రదర్శనలు ఇవ్వడం ఆయన ప్రత్యేకత. శ్రీకృష్ణరాయబారం సన్నివేశంలోని కర్ణ రహస్యం భాగంలో శ్రీకృష్ణుడి పాత్రను సునాయసంగా ప్రదర్శిస్తారు ఆయన. అలాగే సత్యహరిశ్చంద్ర నాటికలో వేటకీను పాత్రను, రాజ్యదానం భాగమందలి హరిచంద్రుని పాత్రను ఎంతో చక్కగా ప్రదర్శించి అనేక మంది ప్రముఖులచే ప్రశంసలు దక్కించుకున్నారు ఆయన. అంతేగాకుండా వారనాసిలో హరిచంద్రుని పాత్ర, చింతామణి నాటకంలో బిల్వమంగళుడి పాత్రల్లో అభినయం అనంతమని కీర్తి పొందారు. తెలుగు భాష పట్ల అభిరుచి కలిగి ఉండటం పట్ల నాటకంలో కంఠమెత్తితే గాత్రం భావయుక్తంగా, ఉచ్చారణదోషాలు లేకుండా స్పష్టమైన పదాల ఉత్పత్తి, హావభావాలు కలిగిన ప్రదర్శనతో నాటక రంగ ప్రేమికులను అలరించడంలో ఆయనది అందెవేసిన చేయి. ప్రత్యేకించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణయ్యను గురువుగా భావించి ఏకలవ్యశిష్యుడిగా ఆయన తన ప్రదర్శనలను మెరుగుపర్చుకున్నారు. కాగా శ్రీశైలం, మహానంది, కర్నూలు, కొలనుభారతి, నంద్యాల తదితర ప్రాంతాల్లో అనేకంగా నాటక ప్రదర్శలు చేశారు. అంతేగాకుండా ఆత్మకూరు చుట్టు పక్కల ప్రాంతాల్లో కూడా ఈయన నటనకు మంచి ఆదరణే కనిపిస్తోంది.

వానలవేళ జాగ్రత్త..!

విద్యుత్ ప్రమాదాలపై ఏపీఎస్పీడీసీఎల్ అవగాహన కార్యక్రమాలు



కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అవగాహన లేమి, నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తరచూ విద్యుత్ ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదాల నివారణకు ఎస్‌ఈ ఎం.ఉమాపతి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆస్కారం అధికంగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, పరిశ్రమలు, ప్రజల వద్దకు ప్రచార వాహనాలను తిప్పుతూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదాలు ఏవిధంగా సంభవిస్తాయనే విషయాలను తెలియపరిచే గోడపత్రికలను అతికిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో రహదారులపై విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా స్తంభాలు ఒరిగినా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఏపీఎస్పీడీసీఎల్‌కు సమాచారం అందించడం వంటి విషయాలపై చైతన్యం కలిగిస్తున్నారు.

● 1912కు సమాచారం ఇవ్వండి

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే కాక ప్రమాదాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను తాకుండా 1912 ద్వారా ఏపీఎస్పీడీసీఎల్‌కు సమాచారం అందిస్తే సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ముఖ్యంగా పొలాల్లో పని చేసే రైతులు పంపుసెట్ల వేసేటప్పుడు జరిగే ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. - విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎం.ఉమాపతి

మహా విరాళం

మహానంది క్షేత్రానికి రూ.2 కోట్ల విలువైన భూమి పత్రాల అప్పగింత


ఆలయ ఈఓకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న దాతలు

మహానంది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానందీశ్వరుడికి రూ.2 కోట్ల విలువ చేసే భూమిని సమర్పించారు. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు దొండపాటి రాజు, శకుంతల దంపతులు గ్రామంలో 5 సెంట్ల ఇంటి స్థలంతో పాటు 528 సర్వే నెంబర్‌లోని 2.10 ఎకరాల పొలాన్ని గురువారం మహానంది ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు మహానంది ఆలయ ముఖ మండపం వద్ద ఈఓ ఆధ్వర్యంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. వేదపండితులు ఆశీర్వదించి, ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గు దుగ్గు.. తుక్కు తుక్కు


రోడ్డు రోలర్‌తో సైలెన్సర్ల ధ్వంసం



కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొండారెడ్డి బురుజు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద 110 బైక్ సైలెన్సర్లను పోలీసులు ధ్వంసం చేశారు. వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు అధిక శబ్దాలు వచ్చే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 110 వాహనాల సైలెన్సర్లను తొలగించారు. వీటిని గురువారం ఉదయం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. 80 డెసిబుల్స్ కంటే అధిక శబ్దాలు వచ్చే బైకులపై సైంటిఫిక్ పద్ధతుల్లో తనిఖీలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా కౌన్సెలింగ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, నాగరాజురావు, రామయ్యనాయుడు, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆనాటి ఎమ్మెల్యే ఆత్మ

5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే అండదండలతో కౌన్సిల్ ఆమోదం, మున్సిపల్ శాఖ సీడీఎంఏ అప్రూవల్ లేకుండానే నిబంధలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ సీసీ డ్రైనేజీ బదులుగా మరో ప్రాంతంలో బీటీ రోడ్డు వేయడమే కాకుండా.. బిల్లులు చెల్లించలేదంటూ మున్సిపాలిటీపై హైకోర్టుకు వెళ్లారని అధికారులే పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో విచారిస్తే.. టెండరు ఒప్పందం నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పనులు చేశారని అధికారులు గుర్తించారు. దీంతో ఒప్పందం ప్రకారం నిజాముద్దీన్ కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మించలేదని వాస్తవ వివరాలతో మున్సిపల్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నివేదిక ఆధారంగా నిబంధనలు ప్రకారం పనులు చేయించడంతో మున్సిపల్ ఇంజనీర్లు విఫలమైనందున ఏపీసీఎస్ ప్రకారం క్రమశిక్షణ చర్యలకు గురి అవుతారని, సీసీఏ రూల్స్ 1991 ప్రకారం సంబంధిత ఈఈ, డీఈఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ అఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ), పబ్లిక్ హెల్త్ విభాగం ఈఎన్‌సీని ప్రభుత్వం ఆదేశించింది. అదే క్రమం ఒప్పంద

బీటీ రోడ్డు నిర్మాణం తరువాత కౌన్సిల్ ఆమోదం

ఒకసారి టెండరు పిలిచిన ఏ పనినైనా మార్పు చేయాలనుకుంటే ప్రతిపాదనలు సవరించాలి. కౌన్సిల్ ఆమోదం, సీడీఎంఏ అప్రూవల్ తీసుకున్న తరువాత మళ్లీ టెండర్లు పిలిచి కాంట్రాక్టరు అప్పగించాలి. ఇందుకు విరుద్ధంగా కౌన్సిల్ ఆమోదం, సీడీఎంఏ అప్రూవల్ లేకుండా కాంట్రాక్టరే ఇష్టారాజ్యంగా సీసీ డ్రైనేజీ బదులుగా బీటీ రోడ్డు వేయడం విమర్శలకు తావిస్తుంది. కాంట్రాక్టరు బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీడీఎంఏ 2023 నవంబరు 9న ఆదేశాలు జారీ చేస్తే.. సదరు కాంట్రాక్టరు, ఇంజనీర్లను రక్షించేందుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రంగంలో దిగారు. సీసీ డ్రైన్లు వేయాల్సిన వీధుల్లో లెక్కకు మించి అక్రమణలు ఉండడడంతో డ్రైనేజీ నిర్మాణాలకు అనుకూలంగా లేనందున ఎమ్మెల్యే కొన్ని మార్పులతో ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించారని, డ్రైన్ల స్థానంలో బీటీ రోడ్డు వేయుటకు చైర్ పర్సన్ ముందస్తు అనుమతి మంజూరు చేశారు. చైర్ పర్సన్ తీసుకున్న అత్యవసర చర్యకు ఆమోదం కోసం కౌన్సిల్ అజెండాలో పెట్టారు. కౌన్సిల్ తీర్మానం నంబరు 497 కింద 2024 మార్చి 7న దీన్ని ఆమోదించారు. అంటే.. 2022 మార్చి 21న సీసీ డ్రైనేజీ నిర్మాణానికి ఒప్పందం చేసుకొని.. ఆ స్థానంలో బీటీ రోడ్డు నిర్మించారు. ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని, పర్యవేక్షించిన ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన తరువాత ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సిఫారసు మేరకు కౌన్సిల్ ఆమోదం తెలపడం చూస్తే వారిని రక్షించేందుకే కౌన్సిల్‌ను వాడుకున్నారని తెలుస్తున్నది. ఆదోని పట్టణంలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే భారీ అక్రమాలు వెలుగు చేసే

- రాజకీయ అండతో అనేక అక్రమాలు
- గత వైసీపీ ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం
- బ్లాక్ లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకావాలని సీడీఎంఏ ఆదేశాలు
- ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ ఆ కాంట్రాక్టరుకే మళ్లీ పనులు

నిబంధనలు ఉల్లఘించిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో చేర్చాలని, అందుకు తీసుకున్న చర్యల నివేదికను తక్షణమే అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంబంధిత ఇంజనీర్లకు చార్జ్ మెమోలు జారీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎల్ఆర్ ఆర్‌ఓసీ నంబరు ఈ-2138965/2023/సీ1 కింద 2023 నవంబరు9న మున్సిపల్ శాఖ అనంతపురం రీజినల్ డైరెక్టరుకు సీడీఎంఏ ఆదేశాలు జారీ చేశారు. అయితే.. ఇందుకు విరుద్ధంగా సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోకపోగా అప్పటి వైసీపీ సాయిప్రసాద్‌రెడ్డి పలుకుపబడితో రూ.కోట్ల విలువైన పనులు ఆ కాంట్రాక్టర్‌కే అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.


మేకల బజారు నుంచి టీజీఎల్ కాలనీకి వెళ్లే రహదారిలో వేసిన బీటీ రోడ్డు

అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. దీనిపై ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఇంజనీరు (ఎంఈ) ఇంతియాజ్ అలీ వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి చూపడమే లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి నిరుద్యోగిని నమోదు చేయిస్తాం
- జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి



కర్నూలు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి చూపడమే లక్ష్యంగా పని చేస్తానని జిల్లా ఉపాధి కల్పనాధికారి, సెట్కూర్ సీఈవో పి. దీప్తి అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని యువత సైతం ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. గురువారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: యువతకు ఉపాధి కల్పించేందుకు ఎలాంటి ప్రణాళికతో వెళ్తున్నారు?

జవాబు: జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించి చదువు పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తాం. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో (ఇండియా స్కాట్ యాక్సిస్ నేషనల్ కేరియర్ సర్వీసు పోర్టల్) ప్రతి నెలా వెయ్యి మంది నమోదు చేసుకునేలా వారికి అవగాహన కల్పిస్తాం. అందులో దేశంలో ఎక్కడెక్కడ వారి చదువుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు ఉన్నాయనేది తెలియజేసే విధంగా కార్యాచరణ రూపొందించాం. నిరంతరం వారికి సమాచారం ఆ పోర్టల్ ద్వారా అందుతుంది.

ప్ర: జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారా?

జ: ఏపీఎస్ఎస్‌సీ, సీడాప్‌లతో కలిసి సంయుక్తంగా ప్రతి నెలా ఎనిమిది జాబ్ మేళాలు నిర్వహించి ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం. కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించమే లక్ష్యంగా పని చేస్తాం. దీంతో పాటు ఇండియా స్కాట్ యాక్సిస్ నేషనల్ కేరియర్ సర్వీసు పోర్టల్ ద్వారా కూడా అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్ర: నైపుణ్య అవకాశాలు ఎలా కల్పిస్తారు?

జ: ఇంటింటికి వెళ్లి నైపుణ్యాలను పసిగట్టి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ సర్వే నిర్వహిస్తాం. ప్రస్తుతం మంగళగిరిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని త్వరలో జిల్లాలో అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఆ ప్రక్రియలో సిల్క్ సర్వే చేపడితే ప్రతి ఒక్కరూ ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది.

ప్ర: ఒకేషనల్ గైడెన్స్ అంటే ?

జ: ఒకేషనల్ గైడెన్స్ ప్రొగ్రాం ద్వారా పది, ఇంటర్, ఐటీఐ చదువుతున్న కళాశాలల్లో డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారికి అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టబోతున్నాం. అర్హతను బట్టి ఎలాంటి ఉపాధి ఉంది.. పైచదువులు చదివితే పొందే ఉపాధి అవకాశాలు ఎలా ఉండబోతాయనేది వివరిస్తాం. అవసరమైతే కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి చదువు కొనసాగిస్తే ప్రయోజనాలపై వివరిస్తాం. చదువుకున్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఉపాధి మార్గాన్ని ఎంచుకోవాలనేది మా లక్ష్యంగా పని చేస్తాం.

ప్ర: ఉపాధి కల్పనపై ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయి..?

జ: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే దానిపై ప్రత్యేక కార్యాచరణ ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రొగ్రాం రూపొందించుకుంటున్నాం. చదువు తగ్గట్టుగా అవకాశాలు కల్పించేందుకు కంపెనీలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ముందస్తుగా ఇంటర్వ్యూలకు వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రముఖ నేషనల్ కంపెనీలు కూడా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయి.

ప్రమాదకర స్థాయిలో తుంగభద్ర ప్రవాహం

మంత్రాలయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దున ప్రవహిస్తున్న తుంగభద్ర నది ఉగ్రరూపం దాల్చింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది వరద నీటితో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రం మంత్రాలయం వద్ద 311.500 మీటర్ల నీటి మట్టంతో 1.11 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. టీబీ డ్యాం నుంచి 1.12 లక్షల క్యూసెక్కుల నీరు తుంగభద్ర నదికి విడుదల చేశారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తహసీల్దారు రవి, సీడబ్ల్యూసీ అధికారులు, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐలు పరమేష్ నాయక్, విజయ్ కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

యురేనియం తవ్వకాలు జరపనివ్వం



నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

- కప్పట్రాళ్ల, బేతపల్లి గ్రామస్థుల నిరసన

దేవనకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలను జరపనివ్వబోమని కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి గ్రామాలు ప్రజలు అన్నారు. గురువారం రిజర్వ్ ఫారెస్టులోని కౌలుట్ల చెన్నకేశవ ఆలయం వద్ద కప్పట్రాళ్ల సర్పంచు చెన్నమ నాయుడు, బేతపల్లి సర్పంచు మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పచ్చటి పల్లెల్లో యురేనియం తవ్వకాల వార్తతో ప్రజల్లో అలజడి చెలరేగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యురేనియం తవ్వకాలతో తమ ప్రాణాలతో ఆటలాడవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకున్నారు. బోర్లు వేసేందుకు వస్తే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు చింతమాను మల్లికార్జున, రంగడు వైసీపీ నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచి మార్గంలో నడిస్తే జీవితం ఉన్నతంగా ఉంటుందని, ర్యాగింగ్ వంటి చెడు మార్గంలో వెళితే జీవితం సర్వనాశనం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. కేఎంసీలో ర్యాగింగ్‌పై పత్రికల్లో వచ్చిన కథ నాలపై స్పందించారు. గురువారం కాలేజీకి వెళ్లి ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి సుధీర్, త్రీటౌన్ ఎస్ఐ మన్మథ విజయ్‌తో కలిసి ఘటన ఎప్పుడు, ఎలా జరిగిందో ఎవరు చేశారో వైద్యులను విచారించారు. అనంతరం అనాటమి హాలులో మొదటి సంవత్సరం విద్యార్థుల దగ్గరకు వెళ్లి ర్యాగింగ్‌పై జరిగిన ఘటన గురించి మాట్లాడారు. ర్యాగింగ్ వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అనంతరం న్యూలెక్చరర్ హాల్‌లో సీనియర్ విద్యార్థులను ఉద్దేశించి న్యాయాధి కారి మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించిన వారికి శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

సీడ్స్ కంపెనీకి మొట్టికాయ

కర్నూలు లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుకు నాసిరకం విత్తనాలు అమ్మి సేవాలోపం చేసిన సీడ్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో మొట్టికాయ వేసింది. ఓర్వకల్లు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన రైతు జి.రమేష్ కర్నూలు చెందిన మహాలక్ష్మి సీడ్స్ దుకాణంలో మహారాష్ట్రకు చెందిన అక్షయ సీడ్స్ కంపెనీకి చెందిన దివ్య రకం క్యాబేజీ విత్తనాలను 2019 మార్చిలో కొనుగోలు చేశారు. పొలంలో విత్తనాలను విత్తి తగిన జాగ్రత్తలు తీసుకుని పంట సాగు చేశారు. అయినా కూడా రైతుకు పంట నష్టం జరిగింది. దీంతో రైతు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ అధికారులు పంటను పరిశీలించి విత్తన లోపంతోనే రైతుకు నష్టం జరిగిందని విచారించారు. కేసును విచారించి రైతుకు నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగ దారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

జీజీహెచ్‌లో టీబీ ముక్త్ భారత్ బృందం పర్యటన



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న డాక్టర్ నీరద

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో టీబీ ముక్త్ భారత్ బృందం గురువారం ఉదయం పర్యటించింది. ఆసుపత్రిలోని న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌తోపాటు ఊపిరితిత్తుల వార్డు ఇతర విభాగాలను టీబీ ముక్తభారత్ ఆఫీసర్ డాక్టర్ నీరద పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యసిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రిమిసంహారక, స్టెరిలైజేషన్ పర్యావరణ సంక్రమణ నియంత్రణ, చేతి పరిశుభ్రమైన ఐజే లోషన్ జాగ్రత్తలను వివరించారు. అంటు వ్యాధుల నివారణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమైనదని జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డికి వివరించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి సునీల్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి, ఐసీఎన్‌లు సంపత్, హర్షద్ పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న ఫార్మసీ విభాగం: ఫార్మసీ విభాగానికి త్వరలో రూపురేఖలు మార్చనున్నట్లు సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆసుపత్రిలో ఉదయం రౌండ్స్ నిర్వహించారు. న్యూరో సర్జరీలో టైల్స్ మరమ్మతులు చేయాలన్నారు. మార్చురి వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించారు. క్యాన్సర్ హాస్పిటల్ రోడ్డు సమీపంలో ఉన్న డంప్‌యార్డ్ దగ్గర ఉన్న వెస్టేజ్‌ను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆగిన పెళ్లి తంతు

- ముహూర్తం సమయానికి కనిపించని వధువు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తండ్రి

పత్తికొండ, అక్టోబరు 24: కొన్ని గంటల వ్యవధిలో జరగాల్సిన పెళ్లి తంతు ఆగిపోయింది. ముహూర్తం సమయానికి పెళ్లి కూతురు కనిపించకపోవడమే ఇందుకు కారణం. అనంతపురం పట్టణానికి చెందిన నరేంద్రకుమార్ కూతురు వైష్ణవికి క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన బజారి కుమారుడు విశ్వాస్‌కు గురువారం వివాహం నిశ్చయమైంది. పత్తికొండ పట్టణంలోని గోపాల్‌ప్లాజాలో పెళ్లికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇరువైపుల బంధువులు బుధవారం రాత్రి గోపాల్‌ప్లాజాకు చేరుకున్నారు. రాత్రి పెద్దతాంబూలం కార్యక్రమాలు పూర్తి చేశారు. ఉదయం పెళ్లి తంతు నిర్వహణకు సిద్ధం అవుతుండగా పెళ్లి కూతురు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెదికినా ఆచూకీ దొరకలేదు. కూతురు కనిపించకపోవడంతో కన్నీటిపర్యంతమైన తండ్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా తెల్లవారు జామున 4 గంటల సమయంలో యువతి వెళ్తుండగా సీసీ కెమెరాలో నమోదైంది. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయన్న తెలిపారు.

ఈవ్‌టీజింగ్‌పై స్పెషల్ డ్రైవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరం లో ఈవ్‌టీజింగ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీసీఎస్ సీఐలు ప్రవీణ్ కుమార్, పార్థసారథిరెడ్డి, లక్ష్మయ్య, మారుతి శంకర్ ఆధ్వర్యంలో ఇద్దరు సివిల్ కానిస్టే బుళ్లు, ఒక ట్రాఫిక్ కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. గాయత్రి ఎస్టేట్, రాజ్‌విహార్, కేవీఆర్ కాలేజీ, బళ్లారి చౌరస్తా, ఆర్టీసీ బస్టాండు సమీపంలో కళాశాలల వద్ద సాయం త్రం నుంచి రాత్రిదాకా నిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల కళా శాలల వద్ద ఈవ్‌టీజింగ్ జరుగుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

ఉచిత బస్సు హామీని అమలు చేయాలి



జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నంద్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలని ఏఐసీసీ మెంబర్, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని నూనెపల్లె సెంటర్‌లో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు చేపట్టి నిరసన తెలిపారు. నంద్యాల నుంచి కంబలూరుకు వెళ్లే పల్లె వెలుగు బస్సులో మహిళలతో మాట్లాడుతూ పోస్ట్‌కార్డ్ ఉద్యమాన్ని చేపట్టారు. సూపర్ సిక్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహాలక్ష్మి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ మాజీ అధ్యక్షుడు చింతలయ్య, సేవాదళ్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, మాజీ ఉపాధ్యక్షుడు ఉసేన్‌బాషా పాల్గొన్నారు.

జిల్లాలో త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ డా.బీసా రాయ్ మీటింగ్ హాలులో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీపీ షుగర్‌తోపాటు క్యాన్సర్ స్క్రీనింగ్‌కు 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు సర్వే చేసి గుర్తించాలని ఆదేశిం చారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఎఫ్‌బీడీ కార్యక్రమా నికి రెఫర్ చేసి తర్వాత పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే అధికారిణి హేమలత, ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ డా.మంజూష, గైనకాలజిస్టు డా.సాహిత్య జయరామ్, డెంటిస్టు ఆదర్శ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- ఒకరికి గాయాలు



చెట్టును ఢీ కొన్న వాహనం

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఒకరికి గాయాలయ్యాయి. కె.నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం బొలేరో వాహనం చెట్టును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఎమ్మిగనూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలేరో వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగా వచ్చి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ఉన్న రామయ్య(43), గురప్ప(32)లు అక్కడి కక్కడే మృతి చెందారు. డ్రైవర్ వెంకటయ్యరే గాయాలు కావడతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఆశ లత సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరి మృతి

దొర్నిపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిదిగాండ్ల మోరి వద్ద ఆటో, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం దొర్నిపాడు నుంచి కోవెలకుంట్లకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆటో, బైక్ ఢీకొనడంతో ఆళ్లగడ్డ మండలం ఓబుళంపల్లెకు చెందిన గైబుసా, నాగిరెడ్డి పల్లెకు చెందిన కృష్ణారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గైబుసాను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గైబుసా (50) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి

ఉరివేసుకొని ఆత్మహత్య

అవుకు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అవుకు మండలం ఇస్రానాయక్‌తండాకు చెందిన అంజనేయ నాయక్ (28) అనే వ్యక్తి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తాగుడుకు బానిస కావడంతో కుటుంబంలో కలహాలు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరివేసుకొని మృతి చెందాడు. మృతునికి భార్య లళితబాయి, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

నూర్పిడి యంత్రంలో పడి వ్యక్తి మృతి



మహమ్మద్ (ఫైల్)

సంజామల, అక్టోబరు 24: ముదిగేడు గ్రామానికి చెందిన పసుపల పెద్ద అలీఖాన్ (58) ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో పడి మృతి చెందాడు. ముదిగేడుకు చెందిన చవ్వా సూర్యుడు తన ట్రాక్టర్ మిషన్‌కు మినుము పంట నూర్పిడి చేయడానికి రావాలని గురువారం సాయంత్రం పిలిచాడు. దీంతో అలీఖాన్ కూలీలతో కలిసి పనికి వెళ్లాడు ట్రాక్టర్ నూర్పిడి యంత్రంపై నిలబడి మినుమును అందులో వేస్తుండగా ప్రమాదశాత్తు యంత్రంలో పడి తునాతునకల య్యాడు. విషయం తెలుసుకున్న సోదరుడు పసుపల మహమ్మద్ మృత దేహాన్ని గృహానికి చేర్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

డోన్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెంపల్లె గ్రామ సమీపంలో చెరువ కుంటలో గల్లంతయిన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. డోన్ మండలం మల్లెంపల్లె గ్రామానికి చెందిన మాదన్న (51) రెండు రోజుల కిందట బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు చెరువు కుంటలో పడి గల్లంత య్యాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం బయట పడటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.



నంద్యాల ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా రోడ్డుపైన పడి ఉన్న రోగి

ఫుట్‌పాత్‌పైన రోగి

- సమాచారం ఇచ్చినా పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది

నంద్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై పడి ఉన్న రోగి గురించి నంద్యాల సర్వజన ప్రభుత్వాసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. తీవ్ర అస్వస్థతతో ఓ రోగి కొద్ది రోజుల క్రితం ఆస్పత్రిలో చేరగా వైద్యులు చికిత్స అందించి ఆ రోగిని పురుషుల వార్డులో ఉంచారు. ఆ రోగి బయటకు వచ్చి తిరిగి వెళ్లేందుకు ఓపిక లేక ప్రభుత్వాసుపత్రికి ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయగా మధ్యాహ్నం నుంచి కనపడటం లేదని పేషెంట్ షీట్‌లో రాసుకున్నామని చెప్పారు. ఫలానా చోట పడి ఉన్నాడని చెప్పినా ఆస్పత్రిలో ఉన్నంత వరకే తమ బాధ్యత అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న శివరామయ్య కుటుంబ సభ్యులు

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో నిర్మిస్తున్న ఈశ్వర దేవాలయ నిర్మాణానికి భక్తులు గురువారం విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన బోయ హనుమంతునాయుడు రూ.లక్ష, శివరామయ్య ఆచారి తరఫున కుటుంబ సభ్యులు రూ.లక్ష దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు దాతలను శాలువాలతో సన్మానించారు. శిల్పి శ్రీనివాసులు, వీరన్నగౌడ్, చంద్రశేఖర్, రామచంద్ర, నీలకంఠ, తిప్పన్నగౌడ్, పార్లపల్లి సోమన్న, వెంకట్రాముడు, ప్రతాప్, శంకర్, పరమేష్, విరూపాక్షి, గోపాల్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



హనుమంతు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

పాణ్యం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు శుక్రవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమవుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయనతోపాటు ముంబైకి చెందిన ఆస్మిత రగ్బీ కాంపిటీషన్ మేనేజరు వికాస్ చౌరాసియా, టెక్నికల్ మేనేజరు నోయల్ మ్యాథ్యూస్‌లు క్రీడల ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆస్మిత రగ్బీ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వతేదీ వరకు జరిగే పోటీలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. 25న ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన 160 మంది, 26న 13 జూనియర్ కళాశాలలకు చెందిన 150 మంది, 27 న రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 13 డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలకు ప్రైజ్ మనీ కింద రూ.లక్ష అందిస్తామన్నారు. మహిళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశం తో కేంద్ర ప్రభుత్వం ఈ పోటీలు ప్రకటించినట్లు తెలిపారు. క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరితలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పీడీలు వెంకట్, నాయక్, మంజుల, చంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈకి డీఈఈగా పదోన్నతి

నంద్యాల రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల డివిజన్ విద్యుత్ కార్యాలయంలోని మీటర్ సెక్షన్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న రామసుబ్రమణ్యంకు డీఈఈగా పదోన్నతి లభించింది. శనివారం ఆత్మకూర్ సబ్‌డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య గురువారం తెలిపారు.

రోళ్లపాడు అభయారణ్యం పరిశీలన

మిడుతూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు అభయారణ్యాన్ని కలెక్టర్ రాజకుమారి గురువారం సందర్శించారు. రోళ్లపాడు అభయ అరణ్యంలోని గెస్టుహౌస్‌కు చేరుకుని సందర్శకులకు ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. అనంతరం అభయ అరణ్యంలో సఫారి వాహనంలో రోళ్లపాడు ఫారెస్టులో సంచరించు జింకలు, పక్షులు వివిద రకాల జంతువులను బైనాక్యులర్ ద్వార పరిశీలించారు. అనంతంరం ఫారెస్టు డీఆర్వో జిహన్ తహేర్‌ను జిల్లా కలెక్టర్ అభయ అరణ్యంలో సంచరించు బట్టమేక పక్షి, ఇతర పక్షులు, జంతువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో రామయ్య, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి ఏపీవోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాలు, గృహనిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమావేశానికి డ్వామా పీడీ జనార్దన్‌రావు, హౌసింగ్ ఈఈ హరిహరగోపాల్ తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ లేబర్ మొబిలైజేషన్‌లో దొర్నిపాడు, మిడుతూరు, జూపాడుబంగ్లా, బేతంచెర్ల, నందికొట్కూర్ మండలాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయన్నారు. పల్లెపండుగలో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్లకు వర్క్ ఐడీ వారీగా పెండింగ్‌లో ఉన్న వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలానికి 1000 చొప్పున 28 మండలాలకు 28వేల సోక్‌పిట్ల నిర్మాణాలకు గానూ కేవలం 308 మాత్రమే ప్రతిపాదనలు వచ్చాయని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రతిగ్రామ సచివాలయానికి ఒకటి చొప్పున రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఏపీవోలను ఆదేశించారు. పీఎం ఆవాస్‌యోజన కింద ఈ వారం 138 గృహాలు పూర్తి చేయాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ హౌసింగ్ సర్వే కింద పెండింగ్‌లో ఉన్న 1526 గృహాల సర్వేను 26వ తేదీలోగా 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 90 రోజుల హౌసింగ్ మ్యాండేస్ ను పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

6న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

ఆత్మకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రంలో వచ్చే నెల 6వ తేదిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరులోని ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు మేడవరం అనిల్ కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబరు 6వ తేది బుధవారం కొలనుభారతి క్షేత్రంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. కొలనుభారతి క్షేత్రంలోని ఆర్యవైశ్య అన్నదాన కేంద్రం వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ పూజల్లో భాగంగా కలశస్థాపన, గణపతిపూజ, అష్టలక్ష్మల పూజ, కుంకుమార్చన, ఉసిరిచెట్టు పూజ, శ్రీరామాసమేత సత్యనారాయణస్వామి వ్రతం, నవవిధాభిషేకం, నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక పూజలు, పంచలోకపాలక పూజలు, వేద ఉపనిషత్తులతో, గద్యాలతో పుష్పపూజ, కుంకుమార్చన క్రతువులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 9441086869, 9985577174 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

వ్యాసరచన పోటీలు


నంద్యాల క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు స్కూళ్లలో విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే పోలీస్ సిబ్బందికి సైబర్ క్రైమ్ నేరాలు-నియంత్రణలో యువత పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

సొంత భవనానికి మోక్షమెన్నడో?

- అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం
- గతంలో వివాదంలో గ్రంథాలయం
- సరిహద్దులు వేయాలని కోర్టు ఆదేశం
- ఇప్పటికీ కొలతలకు వేయని అధికారులు



శిథిలమైన గ్రంథాలయ భవనం



అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

నందికొట్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. దీంతో కొత్తగా పుస్తకాలు రాక, ఉన్న పుస్తకాలకు కూడా శిథిలం అవుతున్నాయి. నూతన భవనం లేకపోవడంతో నిధులు రాక గ్రంథాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. అయితే అవసరమైన పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 59 గ్రంథాలయాలు ఉన్నాయి. అందులో నందికొట్కూరు గ్రంథాలయానికి ఉన్నంత స్థలం ఏ గ్రంథాలయానికి లేదని అధికారులు చెబుతున్నారు. 1945-5-15వ తేదీన పట్టణానికి చెందిన ఐ.రాజగోపాల ఆచారి సర్వే నెంబరు 392బిలో 0.45 సెంట్లు స్థలాన్ని గ్రంథాలయం కోసం దానం చేశారు. 1952లో గ్రంథాలయ భవనం ప్రారంభమైంది. ప్రారంభించిన మొదట్లో గ్రంథాలయాన్ని వినియోగించుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు ఎందరో ఉన్నారు. కాని కాలక్రమేణ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. కొంత కాలం తర్వాత గ్రంథాలయానికి శిథిలావస్థకు చేరుకుంది. అయితే గత కొంతకాలంగా ఈ స్థలం వివాదంలో నలుగుతోంది. గ్రంథాలయ స్థలం ఆక్రమణకు గురైందని కోర్టుకు వెళ్లారు. ఇలా ఎన్నో ఏళ్లుగా కోర్టులో కేసు నడిన తరువాత గ్రంథాలయానికే ఆ స్థలం చెందుతుందని, కొలతలు వేసి సరిహద్దులు వేసి ఇవ్వాలంటూ సర్వే శాఖను కోర్టు ఆదేశించింది. గ్రంథాలయం స్థలం సరిహద్దులో ఉన్న వారు వారి డాక్యుమెంట్లు చూపించడంలో జాప్యం వహిస్తున్నారని, అందుకే సర్వే జరగడం లేదని తెలుస్తోంది. అధికారులు స్పందించి గ్రంథాలయ స్థలాన్ని కాపాడాలని కాపాడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పెండింగ్‌లో పన్నులు

నందికొట్కూరు మున్సిపాల్టీ, మండలంలోని 12 గ్రామాల నుంచి వచ్చే ఇంటి పన్నులో కొంత గ్రంథాలయానికి చెల్లించాల్సి ఉంటుంది. ఒక రూపాయి పన్నులో 8 పైసలను గ్రంథాలయానికి ఆయా గ్రామాలు, మున్సిపాలిటీ చెల్లించాలి. అయితే నందికొట్కూరు మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల నుంచి భారీగా పన్నులు గ్రంథాలయ సంస్థకు రావాల్సి ఉంది. నందికొట్కూరు మున్సిపాల్టీ నుంచి 2023 డిసెంబరు వరకు రూ.68,66,882, 12 గ్రామ పంచాయతీల నుంచి 2018 నుంచి 2024 జనవరి వరకు రూ.4,99,596 పెండింగ్‌లో ఉందని గ్రంథాలయ అధికారి చెబుతున్నారు.

చదువుకోవడానికి అవస్థలు

డీఎస్సీ పోటీ పరీక్షకు చదువుతున్నారు. అయితే లైబ్రరీలో అందుకు సంబంధించిన అధునాతన మెటీరియల్ అందుబాటులో లేదు. దీంతో లైబ్రరీకి వచ్చిన అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

గ్రంథాలయ స్థలాన్ని కాపాడాలి



దాతలు ఇచ్చిన స్థలం గత కొంత కాలంగా అన్యాక్రాంతం అవుతోంది. పట్టణ ప్రజల విజ్ఞాన సంపదను పెంచేందుకు నాడు దాత ఇచ్చిన స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నలుగురికి ఉపయోగ పడే ఈ గ్రంథాలయ స్థలాన్ని అధికారులు సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటు చేయాలి.

– పక్కీర్ సాహెబ్, సీపీఎం నాయకుడు

మొదటి నుంచీ పోరాడుతున్నాం



నందికొట్కూరులో అద్దె భవనంలో గ్రంథాలయం ఉండడంతో చదువుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయ స్థలం ఆక్రమణకు గురైన మొదటి నుంచి పోరాటాలు చేశాం. కోర్టు తీర్పు గ్రంథాలయానికే కేటాయించడం అభినందనీయం. గ్రంథాలయం స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి, ఆపైన గ్రంథాలయం, స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి గ్రూపు-2 పరీక్షలకు శిక్షణ ఇవ్వాలి. దీని వల్ల గ్రంథాలయానికి ఆదాయం కూడా వస్తుంది.

రఘురామ్మూర్తి, సీపీఐ నాయకుడు

భవనం నిర్మిస్తే సాంకేతిక సౌకర్యం కల్పన



సొంత భవనం నిర్మిస్తే అధునాతనమైన సాంకేతిక పరికరాలు వస్తాయి. గ్రంథాలయానికి దాత ఇచ్చిన 45 సెంట్లను సర్వే చేసి ఇవ్వాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అధికారులు సర్వే చేసి సరిహద్దులను ఏర్పాటు చేసిన వెంటనే భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. కొత్త భవనం నిర్మిస్తే కంప్యూటర్లు, ఇంటర్నెట్ లాంటివి గ్రంథాలయానికి వస్తాయి.

– మురళీధర్, లైబ్రేరియన్, నందికొట్కూరు

హాస్టల్ తనిఖీ



బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర బీసీ హాస్టల్‌ను సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని కనీస మౌలిక వసతులు, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అన్న తదితర అంశాలపై హాస్టల్ వార్డెన్ మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూంలో ఉన్న నిత్యావసర వస్తువులను ఆమె పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను అడిగి ఆమె తెలుకున్నారు.

'రక్తదానం చేయాలి'



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన డీఎస్పీ

ఆత్మకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజి నాయక్ సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. అంతకుముందు ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆత్మకూరు, నందికొట్కూరు అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు ఎస్సైలు నారాయణరెడ్డి, హుసేన్‌బాషా, విష్ణు నారాయణ, కేశవ, సురేష్‌బాబు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాయుడు ఉన్నారు.

'అధికారుల సూచనలు పాటించాలి'

వెలుగోడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించ వచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గుంతకందాల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను గురువారం విజయవాడలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి ఈ సందర్భంగా తీసుకెళ్లారు. ప్రధానంగా వైసీపీ హయాంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులకు సంబంధించిన అంశాలపై మంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వర్‌రెడ్డి, సర్వోత్తమరెడ్డి ఉన్నారు.

'నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి'



పాణ్యం డిగ్రీ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పాణ్యం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలకు మంజూరైన నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని ఏఐఎఫ్‌బీ నాయకుడు వెంకటాద్రి డిమాండ్ చేశారు. గురువారం టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వెంకటాద్రి మాట్లాడుతూ కళాశాలలో ఏళ్ల తరబడి తాగునీటికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. పలు మార్లు ఉన్నత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. నాడు-నేడు కింద మంజూరైన నిధులు అధికారుల జేబుల్లో నింపుకొని మినరల్ వాటర్‌ప్లాంటు వచ్చిందని చెబుతున్నారన్నారు. తాగునీటికి మంజూరైన నిధులు ఏమయ్యాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్‌చేశారు.

పాఠశాల పక్కన షాపులను తొలగించాలి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన ఉండే షాపులను వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజా డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. పాఠశాల చుట్టూ షాపులు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పలు మార్లు ఆర్అండ్‌బీ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్అండ్‌బీ శాఖ స్థలాన్ని ఆక్రమించి వాహన రాకపోకలకు అంతరాయమేర్పడుతున్నా చలనం లేదని ఆరోపించారు. ఆక్రమణలను తొలగించని పక్షంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామన్నారు. సతీష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయండి

- డీఈవో సుధాకర్‌రెడ్డి



వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

గడివేముల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అపార్‌లో తప్పులు లేకుండా విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో జరుగుతున్న అపార్ వర్క్‌షాప్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అపార్ విద్యార్థికి విద్యా సంబంధమైన గుర్తింపు సంఖ్య అని చెప్పారు. విద్యార్థి సర్టిఫికెట్లు భవిష్యత్తులో డిజీ లాకర్ ద్వారా జారీ అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో విమలవసుంధరాదేవి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

'డిసెంబరు 15లోపు పూర్తి చేయాలి'

నంద్యాల కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15 నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. గురువారం అమరావతి వ్యవసాయశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పంటల బీమా పథకం అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాజకుమారి, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ అన్ని క్లస్టర్ల ఏడీఏలు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో నష్టపోయిన పంటలకు బీమా పథకానికి అర్హత కలిగిన రైతుల నుంచి నామమాత్రపు ప్రీమియం చెల్లించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కరదీపికలను కలెక్టర్ వ్యవసాయ అధికారులు ఆవిష్కరించారు.

డ్రైనేజీ కాదు.. రోడ్డే..!



రుద్రవరంలోలో మురుగు కాలువను తలపిస్తున్న రహదారి

పాములపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలోని బీసీ కాలనీలో వర్షపునీరు నిల్వ ఉండి బురదమయంగా మారి ప్రజలు నడవడానికి కూడ వీలు లేకుండా ఉంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగులో దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు చొరవచూపి మురుగును తొలగించాలని, నీటి నిల్వ ప్రదేశంలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

'గ్రామ సభలతో సమస్యల పరిష్కారం'

నంద్యాల రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామసభల ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల మండలంలోని చాబోలులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రియదర్శిని, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మండ్ల గుర్రప్ప, గ్రామ నాయకులు ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలోని బొళ్లవరంలో గ్రామసభ నిర్వహించారు. బొళ్లవరం గ్రామంలో రైతుల పొలాలకు రెవెన్యూ రికార్డుల పరంగా రస్తాలు చూపించాలని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో రైతులు రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వో మనోహర్ స్వామన్న, వెంకటేశ్వర్లు, నరసరాజు, ఆనంద్, మద్దిలేటి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ బాబురెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని శివపురంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, వీఆర్వో బాబుమియా, మండల కోఆప్షన్ సభ్యులు గౌస్, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: నల్లకాలువలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక, సర్పంచ్ వెంకటరమణ, టీడీపీ నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని మద్దూరులో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సుభద్రమ్మ, డీఐవో ఉమాపతి, ఆర్ఎస్‌డీటీ సుప్రియ, మండలం సర్వేర్ భాస్కర్, టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, వీఆర్వోలు, వీఎస్‌లు, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలి: టీడీపీ



సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని పార్టీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 26 నుంచి సుమారు రెండు నెలల పాటు జరిగే టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులతో సభ్యత్వాలు నమోదు చేయించాలని తెలిపారు. రెండేళ్ల కాలపరిమితితో రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం పొందడం వల్ల పార్టీలో తగిన గుర్తింపు లభించడంతో పాటు ప్రమాద వశాత్తు మరణించిన కార్యకర్తకు రూ.5లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. అలాగే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదును విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ ఆత్మకూరు మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, వెలుగోడు, మహానంది మండలాల అధ్యక్షులు అన్నారపు శేషిరెడ్డి, ఉల్లిమధు, నాయకులు యుగంధర్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, షాబుద్దీన్ తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రైతులకు న్యాయం చేస్తాం

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 44వ జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 44వ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భం గా మల్లేవేముల గ్రామంలో రైతులు మల్లారెడ్డి, పక్రుద్దిన్, నర సింహారెడ్డి, విఘ్నేశ్వరరెడ్డి మరి కొంత మంది రైతులు తమకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం అందించాలని ఆర్‌డీవోను కోరా రు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, హైవే డీటీ మంజూరు, జేఈ సురేంద్రనాథ్‌రెడ్డి, వీఆర్వోలు ప్రసాదు, ఇమామ్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షిత మంచి నీరు అందించాలి

రుద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతి గ్రామానికి రక్షిత మంచినీరు అందించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని యల్లావత్తుల గ్రామంలో ఇన్‌లైన్ క్లోరినైజేషన్ సిస్టంను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని త నిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యదర్శి పాములేటి పాల్గొన్నారు.

పెచ్చులూడిన భవనం పైకప్పు

- భయాందోళనలో విద్యుత్ సిబ్బంది, అధికారులు

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని ప్రధాన విద్యుత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. విద్యుత్ కేంద్రం ఏర్పాటు నుంచి భవనం మరమ్మతులు చేపట్టక పోవడంతో వర్షాలకు తడిచి పైకప్పు స్లాబ్ దెబ్బ తిని కడ్డీలు బయట పడ్డాయి. పెచ్చులు ఊడి పడుతుం డటంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. పెచ్చులూడిన పైకప్పు కింద కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. అధిక వర్షాలకు భవనాలు ఎప్పుడు కూలుతాయెూనని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసిన నాటి నుంచి మరమ్మతులు చేపట్టక పోవడంతో అధిక వర్షాలు పడితే కూలిపోయే విధంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ సిబ్బంది, రైతులు కోరుతున్నారు.



చాగలమర్రిలో శిథిలావస్థలో విద్యుత్ కేంద్ర భవనం


చాగలమర్రిలో పెచ్చులూడిన భవనం పైకప్పు


మందలూరులో పగుళ్లు ఏర్పడి కడ్డీలు బయటపడిన ట్యాంకు

రుద్రవరం: మండలంలోని మందలూరు గ్రామంలో పాఠశాలకు అతి దగ్గరలో వాటర్ ట్యాంకు పగుళ్లు ఏర్పడి కడ్డీలు బయటపడ్డాయి. వాటర్ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమీపంలోనే పాఠశాల ఉందని, ప్రమాదం జరుగకముందే మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసులు



డోన్ రూరల్ అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామని డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: డోన్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ట్రాఫిక్ అవుట్‌పోస్టు స్టేషన్‌తో పాటు ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేశాం. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల రోడ్ల పక్కల బారికేడ్లను ఏర్పాటు చేయించాము, ట్రాఫిక్ నియంత్రణకు ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ట్రాఫిక్ నియంత్రణకు ఎంత సమయం పడుతుంది?

జవాబు: మూడు నెలల వ్యవధిలో ట్రాఫిక్ నియంత్రించేందుకు కసరత్తు చేస్తున్నాం. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చేసి ప్రజ లకు సమస్యలు లేకుండా చేస్తాం.

ప్రశ్న: గంజాయి, మట్కా, అక్రమ మద్యం పై తీసుకుంటున్న చర్యల గురించి వివరిం చండి..?

జవాబు: డోన్ సబ్ డివిజన్ ప్రాంతంలో గంజాయి, మట్కా, అక్రమ మద్యంపై ఉపేక్షిం చేది లేదు. ప్రత్యేక పోలీసు బృందాలతో వీటిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: సమస్యాత్మక గ్రామాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: డోన్ సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఏర్పాటు చేశాం.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా వేదిక

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఉయ్యాలవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాలులో ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 113 వినతులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ముఖ్యంగా గృహ నిర్మాణాలు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులకు అధికంగా అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు కూడాల నారాయణరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గోపిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, కొర్రపాటి నారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరామ సుబ్బారెడ్డి, వెంకటశివారెడ్డి, చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పల్లె బాబుల్‌రెడ్డి, మద్దూరు క్రిష్టారెడ్డి, కర్నాటి మహేశ్వరరెడ్డి, రామస్వామిరెడ్డి, నరేంద్రనాథరెడ్డి, నూక చంద్రశేఖర్‌రెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, నడిపి వెంకటసుబ్బయ్య, గోతుల శేఖర్, పుల్లయ్య గౌడు, గాండ్ల వెంకటసుబ్బయ్య, భాష, వెంకటేశ్వర్లు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

కొలిమిగుండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : దైవచింతనతోనే మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆధ్యాత్మిక వక్తలు వైవీఎస్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బెలుం గ్రామం శ్రీకృష్ణ మందిరంలో ఆలయ నిర్వాహకులు శివారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వక్తలు వైవీఎస్ నారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి గీతా పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడురు నాగేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు కీలకం

కొలిమిగుండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో భద్రతా ప్రమాణాలే అత్యంత కీలకమని హైదరాబాదు రీజీయన్ మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జ్ఞానేశ్వర్, రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. గురువారం స్థానిక రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో గనుల భద్రతా వారోత్సవాలకు జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో రామ్‌కో ప్రెసిడెంట్ రామరాజు, మైన్స్ హెచ్‌ఓడీ అజ్మల్ అహ్మద్, సీనియర్ మేనేజర్ రవికుమార్, మైన్స్ సేఫ్టీ ఆడిట్ సభ్యులు వినోద్‌కుమార్, యువి రావు, ప్రసాద్, సైదులు, కేశవరెడ్డి, పాల్గొన్నారు.

టీడీపీదే శాశ్వత అధికారం: ఎమ్మెల్యే కోట్ల


సభ్యత్వ నమోదు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశం గర్వించేలా రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నారని, ఇక శాశ్వతంగా టీడీపీదే అధికారం ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. రాక్షస పాలన నుంచి ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. డోన్, పాణ్యం నియోజకవర్గా లను పారిశ్రామికహబ్‌లుగా మార్చేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుందామని, డోన్‌ని యోజకవర్గాన్ని సభ్యత్వ నమోదులో అగ్ర స్థానంలో నిలిపేలా పని చేద్దామని ఎమ్మెల్యే కోట్ల పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే కోట్ల తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీలు శేషఫణిగౌడు, ప్యాపిలి శ్రీనివాసులు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి విజయభట్టు, బేతంచెర్ల మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, మర్రి రమణ, భాస్కర్ నాయుడు, రమేష్ రెడ్డి, దేవరబండ వెంకట నారాయణ, ఆర్‌ఈ నాగరాజు, అన్వర్ బాషా, విజయకుమార్ రెడ్డి, ఎరుకుల చెరువు శివ, భూమా నాగన్న, గోసానిపల్లి మల్లయ్య, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డే మహారాజ్ పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా

సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మంది బాధితులకు భరోసా ఇస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కొచ్చెర్వు గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు ఎమ్మెల్యే కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ రూ.50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ శేషఫణిగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి విజయభట్టు, రంజిత్ కిరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

డోన్ రూరల్: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గోవిందు నాయక్, డోన్ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పట్టణంతో పాటు గ్రామాల్లో జరిగే పశుగణన గురించి ఎమ్మెల్యేకు వారు వివరించారు.

డోన్ ఆర్డీవోగా నరసింహులు

డోన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డోన్ ఆర్డీవోగా కేపీ నరసింహులును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డిని బదిలీ చేస్తూ సెక్రటేరియట్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి నుంచి డోన్ ఆర్డీవోగా వచ్చారు.

పిల్లల కడుపు కొట్టొద్దు: న్యాయాధికారి

ప్యాపిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లల కడుపు కొట్టొద్దని డోన్ సివిల్ కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. గురువారం మండలంలోని రాచెర్ల, ప్యాపిలి బీసీ వసతి గృహాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ వసతి గృహాల్లో ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం పెట్టాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి విద్యాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఆమె వెంట వార్డెన్లు ఉన్నారు.

పకడ్బందీగా రీసర్వే గ్రామ సభలు



చిన్నవంగలి గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లికార్జునరెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రెవెన్యూ డివిజనల్ పరిధిలో భూ రీసర్వే గ్రామసభలు పకడ్బందీగా నిర్వ హించేలా చర్యలు చేపట్టినట్లు నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలో జరుగుతున్న గ్రామ సభను తనిఖీ చేశా రు. ఏవైనా సమస్యలు ఉంటే రైతులు అర్జీల రూపంలో ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, నరేంద్రా రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, గుర్నాథ్‌రెడ్డి, నర్సిరెడ్డి, నాగిరెడ్డి, తహసీల్దా ర్ రవికుమార్, డీటీ విజయ్‌కుమార్, మండల సర్వేయర్ మద్దిలేటి, వీఆర్వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం : మండలంలోని కోటకొండ గ్రామంలో గురువారం రె వెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో రైతుల నుంచి దర ఖాస్తులను డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలో గురువారం తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వ హించారు. భూ సమస్యలు పరిష్కరించాలని 17 మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ, వీఆర్వోలు షమీమ్‌ను, రెవనూరు, మండల సర్వేయర్ నాగప్రసాద్, సర్వేయర్లు సునిల్, గంగాధర్, అమరసింహారెడ్డి ఉన్నారు.

ప్యాపిలి: మండలంలోని నేరేడుచెర్ల గ్రామంలో గురువారం తహసీల్దారు భారతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. భూసమస్యలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న విన తులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో సోమశేఖర్ నా యుడు, రైతులు పాల్గొన్నారు.

అవుకు : గ్రామ సభలతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుం దని డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెర్లోపల్లెలో నిర్వహించిన గ్రామసభలో మూడు దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంగళరెడ్డి, మండల సర్వేయర్ హరికృష్ణ, సచివాలయం సర్వేయర్ రాజు, వీ ఆర్‌వోలు సుబ్బరాయుడు, సుంకన్న, రైతులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఆర్డీవో మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలను ఆర్డీవో తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, సర్వేయరు వీరన్న, టీడీపీ నాయకులు గజ్జల హుసేనయ్య, పెద్దహుసేనయ్య, రాధాక్రిష్ణమూర్తి, మనోహర్, సుబ్బరాయుడు, మహ్మద్‌షరీఫ్ పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని మంగపల్లెలో గ్రామసభ నిర్వహిం చారు. తహసీల్దార్ అనిల్ కుమార్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసి క్రిష్ణ, సర్వేయర్లు క్రిష్ణయ్య, మల్లేశ్వరీ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని బి.తాడిపత్రి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు రైతుల నుంచి 52 దర ఖా స్తులు అందినట్లు మండల సర్వేయర్ సరిత వెల్లడించారు. కార్య క్రమంలో రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలోని బత్తులూరు పాడు గ్రామంలో గ్రామ సభను గురువారం తహసీల్దారు కార్యాలయ సి బ్బంది నిర్వహించారు. 18 దరఖాస్తులు అందినట్లు ఆర్‌ఐ రాఘ వేంద్ర తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తహసీల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురు గాలులతో నేలవాలిన వరి పంట

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. తండా గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఈదురుగాలుల బీభత్సానికి 35 ఎకరాల్లో వరి పంట నేలవాలింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో ఈదురు గాలులతో నష్టపోవాల్సి వచ్చిందని రైతులు బాలనాయక్, శంకర్‌నాయక్, లక్ష్మనాయక్, వెంకటేష్‌నాయక్, విష్ణుకుమార్ నాయక్, మూడేనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న వరిపంట కు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

డోన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం మం డలంలోని గుండాల చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణ పనులను మాజీ మంత్రి బుగ్గన పరిశీలించారు. కార్యక్రమంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, మల్లెంపల్లి రామచంద్రుడు, ఆర్‌ఈ రాజావర్ధన్, పోస్టు ప్రసాద్, తిరుమల్ రెడ్డి, ఉరుకుంద హరి, ఎద్దుపెంట సర్పంచ్ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోపై వేటు

కొలిమిగుండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సర కాలంగా ప్రభుత్వ స్థలాల విషయంలో ఇష్టానుసారంగా నిబంధనలు అతిక్రమించి, అక్రమాల కు పాల్పడిన రెవెన్యూ సిబ్బంది బాగోతం కూటమి ప్రభుత్వ విచారణతో బయటపడుతోంది. ఇంటి స్థలాల ఆక్రమణలపై గత మూడు నెలల క్రితమే ఆంధ్రజ్యోతి పత్రికలో సైతం కథనాలు వెలువడ్డాయి. దీంతో నంద్యాల కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన ఆర్డీవో, ఇతర అధికారులు ఇటిక్యాల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 738, 765లో నిబంధనలకు విరుద్ధంగా గ్రామ వీఆర్వో చెన్నయ్య సుమారు 25 మంది వ్యక్తులకు 50సెంట్లకు పైగా స్థలాలకు ఎన్‌వోసీ మంజూరు చేసినట్లు కలెక్టరుకు నివేదిక అందించారు. దీంతో గురువారం సంబంధిత వీఆర్వోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి వెల్లడించారు.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెళ్లపల్లె గ్రామంలో గురువారం కుక్కల దాడిలో ప్రభుదేవా అనే విద్యార్థి గాయపడ్డాడు. పాఠశాలకు వెళ్తుండగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు గమనించి తరిమికొట్టారు. గాయపడ్డ విద్యార్థి ప్రభుదేవాను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కుక్కల బెడద అధికంగా ఉందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి, మల్లేవేముల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరసింహులు, మాధురి, సీఆర్పీ ఖాసీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గంధోత్సవం

చాగలమర్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని ముత్యాలపాడు రహదారిలో వెలసిన దస్తగిరిస్వామి గంధోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గాను అందంగా ముస్తాబు చేశారు. 25న గంధం, 26న ఉరుసు జరుగుతుందని వెల్లడించారు. ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ముమ్మరంగా స్పెషల్ డ్రైవ్

బనగానపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పంచాయతీ సిబ్బంది చేపట్టారు. పట్టణంలో పేరుకుపో యిన చెత్తాచెదారాన్ని కార్మికులు శుభ్రం చేశారు.

12 వాహనాలకు జరిమానా

బేతంచెర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలకు గురువారం తనిఖీలు నిర్వహించినట్లు డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా వాహనాలకు రోడ్ ట్యాక్స్ కట్టని పలు వాహనాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్ లేకుండా తిరుగుతున్న ట్రాక్టర్లు, ఓవర్‌లోడుతో వెళ్తున్న 12 వాహనాలకు రూ.3.50 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై విచారణ

బనగానపల్లె,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరంలో గ్రామ సమస్యలపై జిల్లా పంచాయతీ అధికారి జమీఉల్లా గురువారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గ్రామంలో పర్యటించారు. గ్రామ సెక్రటరీ పనితీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.ఎంపీడీవో రమణ, ఈవోఆర్డీ సతీశ్‌కుమార్‌రెడ్డి, వెంగన్న ఉన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

రుద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కోటకొండ గ్రామంలో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ బెగాని వెంకటేశ్, మరో వ్యక్తితో పైపులైనును గురువారం కోయించారు. రెవెన్యూ గ్రామసభకు వచ్చిన హెడ్‌కాని స్టేబులు గోపాల్‌నాయక్ చొరవతో వెంటనే పైపులైనుకు మరమ్మతు లు చేయించారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి నరసింహావర్మ మాట్లాడుతూ ట్యాప్ ఏర్పాటు చేయించేందుకు సర్పంచ్ వెంకటేశ్ కోయించారని తెలిపారు.